క్లుప్తంగా

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో

తాళ్లపూడి: రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలు లేకుండా, లబ్ధిదారులకు సమయానుసారం సరుకులు అందేలా స్మార్ట్ కార్డులు ఉపయోగపడతాయని ఆర్డీవో రాణి సుస్మిత, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తాళ్లపూడిలో సోమవారం క్యూఆర్ కోడ్ ఆధారిత నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ మండలంలలో 34 రేషన్ షాపుల్లో 16,810 రేషన్ కార్డుదారులు ఉండగా ప్రస్తుతం 16,667 కార్డులు అందజేస్తున్నట్టు వెల్లడించారు. 143 కార్డులు రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కా అనురాధ, తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బియ్యం దుర్వినియోగానికి అడ్డుకట్ట

నల్లజర్ల: సాంకేతికత వినియోగంతో తయారు చేసిన స్మార్ట్ రేషన్‌కార్డులను మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు గోపాలపురం మార్కెట్‌కమిటీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు అందజేశారు. లబ్ధిదారుడు రేషన్ తీసుకోగానే జిల్లా, కేంద్ర కార్యాలయాలకు సమాచారం అందుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వి.ఎస్ నాయుడు, సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వనితను పరామర్శించిన సూర్యనారాయణ రెడ్డి



బాబూరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్తి సూర్యనారాయణ రెడ్డి, తదితరులు

నల్లజర్ల: మాజీ హోంమంత్రి తానేటి వనిత మావయ్య ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు ఆమెను సోమవారం అనపర్తి నియోకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఇంచార్జి సత్తి సూర్యనారాయణ రెడ్డి తాడేపల్లిగూడెంలో ఆమెను పరామర్శించారు. అనంతరం బాబూరావు చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఘంటావారిగూడెం నాయకులు ఈలప్రోలు చంద్రరావు, రజకసంఘ నాయకులు అన్నవరం, కడలి రూమేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నల్లజర్ల: మండలంలోని ముసుళ్లగుంట గ్రామానికి చెందిన బోడిగడ్ల రాంబాబు, బండెడ్ల వెకటేశ్వరావు, బలుసు వెంకట్రావు వివిధ అనారోగ్య కారణలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మానవత సభ్యులు బాధితులు ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున రూ.12 వేల ఆర్థిక సాయాన్ని మానవత మండలశాఖ అధ్యక్షుడు పాకలపాటి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కార్యదర్శి భోగవల్లి వెంకట సుబ్బారావు, మండల కన్వీనర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

కమిటీలదే బాధ్యత

పెరవలి: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే ప్రతి గ్రామంలో ఎటువంటి ఘర్షణలు జరిగినా దానికి కమిటీ సభ్యులదే బాధ్యత అని తహసీల్దార్ కె. నిరంజన్ తెలిపారు. పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాలు నిర్వహించేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని మైక్ పెట్టుకోవాలంటే డీఎస్పీ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనుమతులు పొందాలని సూచించారు. మండపాలు రోడ్లపై ఏర్పాటు చేయకుండా నిలువరించవలసిన బాధ్యత పంచాయతీ, రెవెన్యూ అధికారులదేనని హెచ్చరించారు. ఎస్సై యం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హిజ్రాలతో డీజే డాన్స్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ 5.74 లక్షలు



అన్నవరప్పాడులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాల హుండీలా ద్వారా రూ.5,61,939 అన్నదాన హుండీల ద్వారా రూ.12,628 ఆదాయం మొత్తం రూ.5,74,667 వచ్చిందని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. సోమవారం హుండీలను తెరచి లెక్కించామని చెప్పారు. 60 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీదారు జి.సత్యవర ప్రసాద్, గ్రామ పెద్దలు రంగనీటి కట్లయ్య, ఓసూరి బాల నాగేశ్వరరావు, బొలిశెట్టి ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చవితికి సర్వం సిద్ధం

- ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి
- అవాంఛనీయ ఘటనలకు తావు ఉండకూడదు
- పోలీసుల అనుమతి పొందాలి

చాగల్లు: వినాయక చవితి అనగానే చిన్నా..పెద్ద అనే తేడా ఉండదు. గల్లీ గల్లీల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఆసక్తి కనబరుస్తారు. నవరాత్రులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. పూజకు కావాల్సిన సామాగ్రిని, వినాయక విగ్రహాల కొనుగోలుతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. విభిన్న ఆకారాల్లో మట్టి వినాయకులు భక్తులకు దర్శనమివ్వడానికి రెడీ అవుతున్నాయి. ఊరూవాడా వినాయకుడిని కొలువు దీర్చేందుకు మండపాలు సిద్ధం చేస్తున్నారు. పోలీస్, విద్యుత్ శాఖల నుంచి అనుమతులు పొందాలి. దీనికోసం పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగానే సింగిల్ విండో విధానం ద్వారా అనుమతి పొందే అవకాశాన్ని పోలీస్ శాఖ కల్పిస్తోంది.

పరిశీలన తర్వాతే అనుమతులు..

దరఖాస్తుదారు పేరు, ఈ-మెయిల్ అడ్రస్, చిరునామా, అసోసియేషన్ పేరు, గణేశ్ మండపం ఏర్పాటు చేసే స్థలం, కాలనీ, పోలీసు సబ్‌డివిజన్ పేరు, పోలీసుస్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, మండలం, ఐదుగురు కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, వినాయక నిమజ్జనం తేదీ, సమయం, నిమజ్జనం చేసే ప్రదేశం, విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం ఇలా వివరాలన్నింటినీ దరఖాస్తులో పొందుపరచాలి. తర్వాత సబ్మిట్ బటన్ నొక్కితే ఐడీ వస్తుంది. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్ అధికారులు మండపాలను పరిశీలిస్తారు. ఎలాంటి అభ్యంతరాలు లేకుండా నిబంధనల ప్రకారం మండపం ఏర్పాటు చేసినట్లయితే వెబ్‌సెట్‌లో ఆమోదిస్తారు. చివరగా క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారు. దానిని విగ్రహం వద ప్రదర్శించాలి. కోడ్‌ని స్కాన్ చేస్తే విగ్రహానికి సంబంధించి సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు వీలుంటుందని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

డీజే పాటలు నిషేధం..

ట్రాఫిక్ అంతరాయం కలిగించేలా రహదారి మధ్యలో వినాయక మండపాలు ఏర్పాటు చేయరాదు. విగ్రహాల వద్ద ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తిపాటలు మాత్రమే పెట్టుకోవాలి. డీజేలు, సినిమా పాటలు నిషేధం. మండపాల్లో నిరంతరం విధిగా ఒకరు కాపలాగా ఉండాలి. భారీ విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నల్లజర్ల మార్కెట్ సెంటర్‌లో చవితి సందడి

కమిటీ సభ్యులదే బాధ్యత



వినాయక విగ్రహాలన్ని ఏర్పాటు చేసే నిర్వాహకులు, కమిటీ సభ్యులు విగ్రహం ఏర్పాటు చేసినప్పటి నుంచి నిమజ్జనం జరిగే వరకు పూర్తి బాధ్యత తీసుకోవాలి ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి అవసరమైన అన్ని అనుమతులు తీసుకుని నియమ నిబంధనలు పాటిస్తూ వినాయక చవితి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి.

–కె.నరేంద్ర, చాగల్లు ఎస్సై

జాగ్రత్తలివే..

మండపాలను మండే స్వభావం లేని రేకులతో ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలు పడే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. విగ్రహాన్ని ఉంచేందుకు పటిష్ఠమైన వేదిక ఉండాలి. విద్యుత్ సరఫరాకు అతుకులు లేని నాణ్యమైన తీగలనే వినియోగించాలి. విగ్రహ పర్యవేక్షణ బాధ్యతలను కమిటీ సభ్యులు పిల్లలకు అప్పగించరాదు. వాహనాల పార్కింగ్ మండపానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలి. నూనె డబ్బాలు, ఇతర మండే స్వభావం కలిగిన వస్తువులను మండపంలో ఉంచరాదు. అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలి.

జోరుగా అమ్మకాలు

కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు, చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం, తాళ్లపూడి తదితర చోట్ల విగ్రహాల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. విగ్రహాల సైజు 4 అడుగులు నుంచి 10 అడుగుల వరకు తయారుచేశామని వాటి ధర నూ.6 వేల నుంచి రూ.25 వేల వరకు ఉందని, చాలా మంది ఇప్పటికే బొమ్మలకు అడ్వాన్సులు చెల్లించి బుక్ చేసుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. పండుగ లోపు మొత్తం విగ్రహాలు అమ్ముడవుతాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ.40 లక్షల వ్యయం

శ్రీగణపతి నవరాత్రి మహోత్సవాలకు రాష్ట్ర స్థాయిలోనే చాగల్లు ప్రసిద్ధి గాంచినది. చాగల్లు తెలగా సంఘం, నెలటూరు వర్తక సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామంలో రెండు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో 70 ఏళ్లగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 27 వ తేదీ నుంచి వచ్చే నెల 5 తేదీ వరకు 9 రోజుల పాటు ఉత్సవాల నిర్వహించనున్నారు. ఈ 9 రోజుల పాటు చాగల్లు ప్రధాన కూడలి భారీ సెట్టింగులు, విద్యుద్దీపాల అలంకరణ, దేవతామూర్తుల విగ్రహాలు, ప్రత్యేక శోభను సంతరించుకుంటుంది. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలు పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలతో పాటు సినీ మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సత్యహరిశ్చంద్ర, కురుక్షేత్రం, రామాంజనేయయుద్ధం, చింతామణి వంటి ప్రాచుర్యం పొందిన నాటకాలు సైతం ప్రదర్శిస్తారు. ఒకొక్క ఉత్సవ కమిటీ సుమారు రూ.20 నుంచి 25 లక్షలు వ్యయంతో రెండు కమిటీల వారు రూ.40 లక్షలకు పైగా ఖర్చులు చేసి ఉత్సవాలకు నిండుతనం తీసుకురావడానికి కృషి చేస్తున్నారు.

120 ప్రతిమలు ఏర్పాటు

దేవరపల్లి: వినాయక చవితి ఉత్సవాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీ గ్రామాల్లో సుమారు 120 ప్రతిమలను ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. నిర్వహణకు అవసరమైన అనుమతులను నిర్వహకులు ఆన్‌లైన్ ద్వారా తీసుకొంటున్నారు. డీజే సౌండ్స్, అస్లీల నృత్య ప్రదర్శనలకు పోలీసులు అనుమతులను నిరాకరించారు. దేవరపల్లిలోని మెరక వీధి వినాయకుడి ఆలయం, స్థానిక సీబీఎస్ కాలనీలోని వరసిద్ధి వినాయకుడి ఆలయం వద్ద ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి.

ఒక రోజు ముందుగానే

నల్లజర్ల: బుధవారం వినాయక చవితి కావడంతో ఒక రోజు ముందుగానే వినాయక ప్రతిమలు, పూజా సామాగ్రి తెచ్చుకొని జాగ్రత్త చేసుకుంటున్నారు. విఘ్ననాయకుణ్ణి పూజించేందుకు ఆలయాలను ఇప్పటికే వైభవంగా ముస్తాబు చేశారు. నల్లజర్ల, పోతవరం, దూబచర్ల, అనంతపల్లిలో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. మట్టి గణపతులనే పూజిద్దాం అంటూ పర్యావరణ వేత్తలు పిలుపునివ్వడంతో వాటిపై ఆశక్తి కనబరుస్తున్నారు. దీంతో ఆయా గ్రామాలలో మార్కెట్లు కళకళలాడుతున్నాయి.



కొలువు తీరిన భారీ గణనాథులు



సినీనటి మెహ్రీన్ పిర్జాదను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ (ఫైల్)



మెరకవీధిలో చవితి ఉత్సవాలకు ముస్తాబవుతున్న మండపం

గణేష్ చౌక్ సెంటర్‌లో 103 ఏళ్లుగా..



నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన 20 అడుగుల భారీ విగ్రహం

నిడదవోలు: వినాయక చవితి పండుగకు ఒక్క రోజే గడువు ఉండడంతో నియోజకవర్గంలో వాడ వాడలా గణపతి నవరాత్రుల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే చలువ పందిళ్ల ఏర్పాటులో యువత నిమగ్నమయ్యారు. నిడదవోలు నియోజకవర్గం పరిధిలో సుమారు 700 పైగా గణనాథులు కొలువుదీరుతాయని అంచనా. పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్‌లో పూజా గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 103 ఏళ్లగా ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో ఈ ఏడాది 103వ చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయానికి నిడదవోలు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. భారీ సెట్టింగ్‌లు, వివిధ దేవత మూర్తుల విద్యుత్ దీపాల అలంకరణలు ఆకుట్టుకుంటాయి.

కోలుకోలేనంత నష్టం



ముక్కామల గ్రామంలో నీటమునిగిన అరటితోట

పెరవలి: గోదావరికి వరద తగ్గుముఖం పట్టడంతో నది పరివాహాక లంక గ్రామాల్లో నీటమునిగిన పంటలు ఒక్కక్కటిగా తేరుకుంటున్నాయి. పూర్తిగా మునిగిన పంటలు పాడైపోగా, సగానికి మునిగిన కొబ్బరి, పామాయిల్, ఖోఖో పంటలకు కొంతమేర నష్టం ఉండదని రైతులు భావిస్తున్నారు. మండల పరిధిలోని లంక భూముల్లో 2,200 ఎకరాలు ఉండగా వీటిలో పూర్తిగా 1,224 ఎకరాలు నీటమునిగాయని ఉద్యానవన అధికారి గోపాల్ సోమవారం తెలిపారు. ఉద్యాన పంటలైన కూరగాయలు, ఆకుకూరలు, అరటి, కంద, పసుపు, మొక్కజొన్న, నువ్వు, మినుము, బొప్పాయి పంటలు పూర్తిగా నాశనమవుతాయని రైతులు వాపోతున్నారు. పొలల్లో నీరు లాగిన తరువాతనే పూర్తి పంట నష్ట వివరాలు తెలుస్తాయని ఆయన తెలిపారు. ధవళేశ్వరం వద్ద ఇంకా వరద ప్రవాహం కొనసాగుతుందని ఏడు లక్షల క్యూసెక్కుల నీటిని వదలటంతో దిగువ లంకలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ప్రాజెక్టుకు ఎగువ ఉన్న వాణిజ్య పంటలకు పెద్దగా నష్టం వాటిల్లదని పేర్కొన్నారు.

హామీలు అమలు చేయని మోసకారి



తాడిపూడిలో బాబూ ష్యూరిటీ-మోసం గ్యారంటీలో పాల్గొన్న తలారి వెంకట్రావు, నాయకులు



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, గ్రామస్తులు

తాళ్లపూడి: ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఏడాది పూర్తయినా అమలు చేయని ఘనత మోసకారి చంద్రబాబుకే దక్కుతుందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. తాడిపూడిలో సోమవారం బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ గ్రామ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అన్ని భూటకమని ఉచిత బస్సు తప్పితే మిగతావన్ని జగనన్న ప్రవేశపెట్టిన పథకాలనే పేరు మార్చి ఉల్టా కొట్టించి పరిపాలన సాగిస్తూ ప్రజలను మోసాగిస్తున్నారన్నారు. ఒక పక్క దేశానికి రైతులు వెన్నుముక అని అంటూ యూరియా కూడా అందజేయడం లేదని మండిపడ్డారు. తనిఖీల పేరుతో వికలాంగుల పింఛన్లకు కొత పెడుతున్నారన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తానని చెప్పి, 15 నెలల్లో కేవలం ఒకటే ఇచ్చారని, నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి అందించలేదని, ఇలా రాష్ట్రంలో మహిళలను, రైతులను, నిరుద్యోగులను ప్రతి వర్గాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశారని దుయ్యాబట్టారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్ని జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారని తలారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కమిటీ కన్వినర్, ఎంపీపీ జొన్నకూటి, గ్రామ సర్పంచ్ నామా శ్రీనివాస్, పార్టీ జిల్లా ఉపాధ్యాక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంతమణి రమేష్, రాష్ట్ర ఎస్సీ సెల్‌కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, జిల్లా యాక్టివ్ కార్యదర్శి వంబోలు పోసిబాబు, మండల నాయకులు కొమ్మిరెడ్డి పరశురామారావు, గూడా విజయరాజు, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, మండిగ గిరి, ముప్పిడి దమయంతి, సుంకర సత్యనారాయణ, వెంపాటి సతీష్, కవల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి మహాప్రభో..!



పింఛన్ కోసం ఫిర్యాదు చేస్తున్న అరిగెల సంపూర్ణ

పెరవలి: కట్టుకున్న భర్త రోడ్డు ప్రమాదంలో నడుము విరిగి మంచాన పడడంతో 4 ఏళ్లుగా సాయం చేయమని అధికారులు చుట్టూ తిరిగిన ఎవరూ పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా మంచానపడి ఉన్న నా భర్తకు పింఛన్ మంజూరు చేయండి మహాప్రభో అంటూ కుటుంబంతో సహా వచ్చి అధికారులను వేడుకుంది ఓ మహిళ. పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో 4 ఫిర్యాదులు వచ్చాయని డీటీ సన్నిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాపవరం గ్రామానికి చెందిన అరిగెల సంపూర్ణ తన భర్త రాంబాబు నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో నడుముకి తీవ్ర గాయం అవ్వడంతో మంచానికే పరిమితయ్యారని, కనీసం పింఛన్ మంజూరు చేస్తే రెండు పూటలా తిండి తింటామని గోడున విలపించింది. దీనిపై ఈఓపీఆర్‌డీ సీహెచ్ వెంకట రమణ స్పందిస్తూ పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని మహిళకు భరోసానిచ్చారు.

రైతులకు అందుబాటులో యూరియా



కానూరు సొసైటీలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ, విజిలెన్స్ అధికారులు

పెరవలి: యూరియాను అధిక ధరలకు అమ్మకాలు చేసినా, అక్రమంగా నిల్వలు పెట్టినా చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారి లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మండల పరిధి కానూరు సొసైటీలో ఎరువులను పరిశీలించి, రికార్డులు తనిఖీలు చేశారు. డివిజన్‌కు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచామని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కడైనా సొసైటీలో కానీ, ప్రైవేట్ డీలర్స్ కానీ అధిక ధరలకు అమ్మితే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఏడీఏ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కానూరు సొసైటీలో 25 మెట్రిక్స్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందని రైతులు ఆందోళన చెందనవసరం లేదని ప్రభుత్వ ధరలకే విక్రయిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మేరీ కిరణ్, సొసైటీ సిబ్బంది, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణల్లో తనిఖీలు

చాగల్లు: మండలంలో సోమవారం విజిలెన్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఏజీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్‌వీ లక్ష్మీనారాయణరావు, కొవ్వూరు ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ ఊనగట్ల సహకార పరపతి సంగం, నందిగంపాడు శ్రీసాయి కిట్టు ట్రేడర్స్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఉనగట్ల వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎరువుల స్టాక్ నందు వివరాలను బోర్డు సభ్యులు సరిగ్గా నమెదు చేయనందున రూ.10 లక్షల రూపాయల విలువ గల ఎరువులను తాత్కాలికంగా అమ్మకాలు నిలుపుదల చేసినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ తనిఖీల్లో మండల తహసీల్దార్ ఎం.మేరికమ్మ, చాగల్లు పోలీసులు, వ్యవసాయ అధికారులు కె.వేణుగోపాలకృష్ణ, బి.రాజారావు, బి.సోమశేఖరమ్ పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్ట్

నల్లజర్ల: మండల కేంద్రం నల్లజర్ల శివారు కొబ్బరితోటలో ఆదివారం రాత్రి కోడి పందేల స్థావరాలపై సీఐ బాలశౌరి ఆధ్వర్యంలో మెరుపుదాడులు చేశారు. ఈ మేరకు 13 మందిని అదుపులోకి తీసుకుని 16 కార్లను, రూ.35 వేల నగదు, 3పందెం కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పందేలు స్థానిక టీడీపీ నేత మండ సురేష్ అనే నాయకుడు కొబ్బరి తోటలో జరిగినట్టు పలువురు చెబుతున్నారు. కేసు మాఫీ చేయడం కోసం టీడీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేశారు. అప్పటికే మీడియాలో కథనాలు రావడంతో గత్యంతరం లేని స్థితిలో పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలుస్తోంది.

12 సీసీ కెమెరాల బహూకరణ

నల్లజర్ల పోలీస్ స్టేషన్‌కు శ్రీ చక్ర పాల ఫ్యాక్టరీ యాజమాన్యం 12 సీసీ కెమెరాలను బహూకరించింది. వీటిని మండలంలోని సమస్యత్మక ప్రాంతాల్లో అమర్చుతామని సీఐ బాలశౌరీ తెలిపారు.

యూరియా కోసం అగచాట్లు



గోపాలపురం సొసైటీ వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

గోపాలపురం: మండలంలోని చిట్యాల, గోపాలపురం ,భీమోలు గ్రామాలకు సోమవారం 200 బస్తాలు చొప్పున యూరియా దిగుమతి చేశారు. సమాచారం అందుకున్న సీఎంఎస్‌ల పరిధిలో ఉన్న సుమారు 400 మంది రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. ఈ నేపథ్యంలో 10 ఎకరాలు ఉన్న రైతుకి ఒక్క బస్తా యూరియా మాత్రమే ఇస్తామనడంతో ఆయా డీసీఎంఎస్‌ల వద్ద రైతులు సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల పేరుమీద ఉన్న భూమి తాలూక పాస్‌బుక్, ఆధార్ కార్డు సమర్పించినా మనిషి రాకపోతే యూరియా ఇవ్వడం కుదరదని వెనక్కి పంపించివేశారు. గోదాములకు జిల్లా అధికారుల నుంచి ఉదయం 7 గంటలకు రావాల్సిన ఓటీపీ సుమారు 11.30గంట సమయంలో రావడంతో రైతులు అన్నపానియాలు లేక ఎండలో నలిగిపోయారు. దీంతో చిట్యాల గ్రామ రైతులు సిబ్బందిపై ఎదురు తిరగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతులకు సర్ది చెప్పారు.

ఒక బస్తా ఎలా సరిపోతుంది.?



ఎకరాలకు ఒక బస్తా యూరియా ఇస్తే ఎలా సరిపోతుంది. వరిపంట నడపట్టు దశలో ఉంది. యూరియా అందకపోతే తీవ్రనష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం అసమర్థత వల్ల వరి రైతులు నష్టపోతున్నారు.

కె.వెంకటేశ్వరరావు, రైతు, కరగపాడు

స్టాపర్ బోర్డుల బహూకరణ



పోలీస్ సిబ్బందికి స్టాపర్స్ బోర్డులు అందిస్తున్న దాతలు

పెరవలి: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పలువురు దాతలు రూ.20 వేలు విలువ కలిగిన స్టాపర్స్ బోర్డులు పెరవలి పోలీస్ స్టేషన్‌కు బహుకరించారు. ఈ మేరకు ముక్కామల గ్రామానికి చెందిన వేదాద్రి ట్రేడర్స్, అపోలో టైర్స్ డీలర్ మానేపల్లి శ్రీనివాస్ రావు సోమవారం వీటిని ఎస్సైకి అందించారు. అనంతరం స్టేషన్ ఎస్సై మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు స్టాపర్స్ బోర్డులు అందిచడం హర్షణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.

పీఎంపీలు ప్రాథమిక వైద్యాన్ని అందించాలి

నల్లజర్ల: పీఎంపీలు తమ పరిధిలో ప్రాథమిక వైద్యాన్ని మాత్రమే అందించాలని పీఎంపీల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు తోరాటి ప్రభాకరావు సూచించారు. నల్లజర్లలో సోమాలమ్మ ఆలయం వద్ద సోమవారం అధ్యక్షుడు బి.సీతారాం అధ్యక్షతన మండలశాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకరావు మాట్లాడుతూ పీఎంపీలు ఎప్పటికప్పుడు నూతన వైద్య విధానాలపై అవగాహన కల్గి ప్రజలకు మేలైన వైద్య సేవలు అందించాలన్నారు. పరిధి దాటి వైద్యం చేయవద్దన్నారు. త్వరలో పీఎంపీల జిల్లా సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, సహాయ కార్యదర్శి ఏ.ధనుంజయ, కోశాధికారి జీవీ రమణమూర్తి, ఏ.రామకృష్ణ సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులతో అక్రమాలకు చెక్

నిడదవోలు: రేషన్ సరకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేపటినట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో రేషన్ కార్డుల పంపిణీని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించి పలువురు కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కార్డుపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ సరకుల వివరాలు, కేటాయించిన పరిమాణం, రేషన్ పొందిన స్థితి, డిపో వివరాలు తెలుస్తాయన్నారు.